# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-06-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. భారత్ ఇటలీల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సుస్థిరపరచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**

**2. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.**

**3. సామాన్యులకు విమానయాన రంగాన్ని మరింత చేరువ చేస్తామని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.**

**4. తెలంగాణలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించిన ప్రాథమిక కీ ని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది.**

**5. ఈరోజు ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

==========================

భారత్ ఇటలీ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సుస్థిరపరచుకోవడానికి, తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోది అన్నారు. ఇటలీ పర్యటనకు వెళ్తున్న సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, ఇండో పసిఫిక్ –సముద్రం, మధ్యదరా సముద్ర ప్రాంతంలో సహకారాన్ని పటిష్ట పరచుకోవడానికి, జీ 7 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు తాను ఇటలీ ప్రధానమంత్రి ఆహ్వానంపై అపులియా ప్రాంతానికి వెళుతున్నానని చెప్పారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. నిన్న సాయంత్రం వెలగపూడి సచివాలయం మొదటిబ్లాక్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం. 16 వేల 347 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి సంబంధించి మెగా డీఎస్సీ దస్త్రంపై మొదటి సంతకం చేశారు. ఆంధ్రప్రదేశ్ భూ హక్కు చట్టం రద్దుపై రెండో సంతకం, సామాజిక పింఛన్లు 4వేల రూపాయలకు పెంపు దస్త్రంపై మూడో సంతకం, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై నాలుగు, నైపుణ్య గణనపై ఐదో సంతకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అఖిల భారత సర్వీసులకు చెందిన అధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు

నాయుడు నిన్న వెలగపూడి సచివాలయంలో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర పరిపాలనలో విషయంలో ఐఏఎస్, ఐపీఎస్ లకూ కీలకపాత్ర ఉంటుందని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో జరిగిన విధానపరమైన విషయాలపై పునఃసమీక్షిస్తానని చెప్పారు. పరిపాలన పరంగా ప్రభుత్వ విభాగాలన్నీ సమర్ధవంతంగా పనిచేసేలా ఐఏఎస్, ఐపీఎస్ వ్యవహరించాలని తెలిపారు.

---------------------------

సామాన్యులకు విమానయాన రంగాన్ని మరింత చేరువ చేస్తామని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఢిల్లీలో పౌర విమానయాన శాఖ మంత్రిగా నిన్న బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, విజయవాడ, తిరుపతికి విమానాల కనెక్టివిటీ పెంచుతామని తెలిపారు. దేశంలోని చిన్న పట్టణాలకు కూడా విమానయాన సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని తెలుపుతూ,

వాయిస్ (28 సెకన్లు)

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హయాంలో కోతలు లేకుండా విద్యుత్ అందిస్తున్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో నిన్న కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ,. దేశంలో అధికంగా బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని చెప్పారు. రానున్న రోజుల్లో బొగ్గు దిగుమతి తగ్గించి దేశీయంగా ఉత్పత్తి పెంచుతామని పేర్కొంటూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

దేశవ్యాప్తంగా సమాచార వ్యవస్థలను బలోపేతం చేసేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఢిల్లీలోని సంచార్‌భవన్‌లో గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల సహాయమంత్రి మంత్రిగా నిన్న బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, కేంద్ర సహాయమంత్రిగా అప్పగించిన బాధ్యతలను నెరవేర్చేందుకు తన వంతు కృషి చేస్తాననితెలిపారు. తన శాఖల కేబినెట్ మంత్రులుగా మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, సీనియర్ నాయకులు జ్యోతిరాదిత్య సింధియా ఉన్నారని వారి మార్గదర్శనంలో ప్రజలకు సేవ చేస్తానని పేర్కొంటూ,

వాయిస్ (20 సెకన్లు)

---------------------------

ఈరోజు ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహిస్తున్నారు. రక్తదానం చేసే వారికి కృతజ్ఞతలు తెలియజేయడం, రక్తదానం పట్ల ప్రజలలో అవగాహన పెంపొదించి... ఈ కార్యక్రమాన్ని ఉచితంగా నిర్వహించేలా ప్రోత్సహించడం, రక్తదానం వల్ల మన శరీరానికి కలిగే మేలును తెలియజేయడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. రక్తంలోని గ్రూపులను కనుగొన్న ఆస్ట్రియా, అమెరికా దేశాల పౌరసత్వం కలిగిన జీవ శాస్త్రవేత్త, వైద్యులు కార్ల్ ల్యాండ్ స్టీనర్ జయంతి 1868 జూన్ 14ను రక్తదాతల దినోత్సవంగా నిర్వహించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతిఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం జరుగుతోంది. కాగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం

సందర్భంగా ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్త విభాగం ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని ఈ రోజు 10 గంటలకు ప్రసారం చేస్తోంది.

---------------------------

తెలంగాణలో ఇటీవల జరిగిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించిన ప్రాథమిక కీ ని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ – టిజిపిఎస్సీ విడుదల చేసింది. ఈ పరీక్ష కీతో పాటు ప్రధాన ప్రశ్నపత్రాన్ని టిజిపిఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. ఈనెల 17వ తేదీ వరకు ఈ లింక్‌ను ఆన్‌లైన్‌లో ఉంచనున్నట్లు టీజీపీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది. కీ పట్ల ఏవైనా అభ్యంతరాలుంటే తెలపవచ్చని పేర్కొంది. అలాగే, కీ పట్ల తమ అభ్యంతరాలకు సంబంధించిన ఆధారాలను అప్‌లోడ్ చేయవచ్చని టీజీపీఎస్సీ సూచించింది.

---------------------------

ప్రజల పక్షాన సమస్యలపై వైసిపీ పోరాడుతుందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. నిన్న తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శాసన మండలి సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజకీయాల్లో వ్యక్తిత్వం విలువలు, విశ్వసనీయతే ముఖ్యమన్నారు. ప్రజల్లో నిరంతరం ఉంటూ రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలు ముమ్మరం చేస్తామని తెలిపారు.

---------------------------

తెలంగాణలో మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. ఈ మేరకు వివిధ శాఖల అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రెండేళ్లలో తెలంగాణ వ్యాప్తంగా 150 మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామైక్య సంఘాలకు వీటి నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు. బెంగాల్, కేరళలలో ఇటువంటి క్యాంటీన్లపై ఇప్పటికే అధ్యయనం చేసినట్లు వివరించారు. వీటి నిర్వహణపై మహిళా సంఘాలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళ శక్తి క్యాంటీన్ల పనితీరు, నిర్వహణ, అవసరమైన స్థలం తదితర వివరాలతో మార్గ సూచి తయారు చేయాలని అధికారులను శాంతికుమారి ఆదేశించారు.

---------------------------

నైరుతి రుతుపవనాలు మరో నాలుగు రోజుల్లో మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్, ఒడిశా, కోస్తా ఆంధ్రప్రదేశ్‌లోని వాయువ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాల్లోకి మరింత ముందుకు వెళ్లేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్ర, యానాంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేక రెండు చోట్ల కురిసే అవకాశముందనీ తెలిపింది. అలాగే ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వెల్లడించింది.

తెలంగాణలో ఈ రోజు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మరోవైపు నైరుతి రుతుపవనాలు తెలంగాణలోని అన్ని జిల్లాలకు విస్తరించాయని పేర్కొంది.

ఉరుములు, మెరుపులతో పాటు భారీ గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.

---------------------------

అటవీ భూముల్ని ఇతర అవసరాలకు బదలాయించినందుకు పరిహారంగా ఇచ్చే భూముల్ని గుర్తించేందుకు తెలంగాణ ప్రభుత్వం అధికారుల కమిటీని ఏర్పాటు చేసింది. అటవీ సంరక్షణ ప్రధాన అధికారి చైర్మన్‌గా, రెవెన్యూశాఖ ప్రతినిధి, సీసీఎల్ కార్యాలయ ప్రతినిధి, అటవీ పర్యావరణశాఖ నుంచి ఒక అధికారి, అటవీశాఖలో డిప్యూటీ కన్జర్వేటర్ సభ్యులుగానియమిస్తూ, ఈ మేరకు తెలంగాణ అటవీశాఖ ముఖ్యకార్యదర్శి వాణీప్రసాద్ నిన్న ఉత్తర్వులు జారీ చేశారు.

========================